## ప్రాణం ఉన్నంత వరకూ దీక్ష..

**దృఢమైన** ఆత్మవిశ్వాసంతోనే నేనీ దీక్షను ప్రారంభిస్తున్నాను. భగవంతుడు, తెలంగాణ ప్రజలు పూర్తి స్థాయిలో దీనిని ఆశీర్వదిస్తున్నారు. 36 దేశాల నుంచి ప్రజలు ఫోన్ల ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం విజ్ఞతతో కళ్లు తెరుస్తుందనీ, ప్రజాస్వామ్య బద్ధంగా ఆలోచిస్తుందనీ, ఈ దీక్షను కొనసాగనిస్తుందనీ నేను ఆశిస్తున్నాను. ఒకవేళ ఆటంకాలు కల్పించే ప్రయత్నం చేస్తే వాళ్ల చేతులు వాళ్లే కాల్చుకున్నట్టు అవుతుంది. ప్రభుత్వానికి ఇది నా చివరి విజ్ఞాపన. రాష్ట్ర ముఖ్యమంత్రి విజ్ఞత ప్రదర్శించాల్సిన సమయం ఇది. దేశవిదేశాల్లో ఉన్న తెలంగాణ వాణి ఇంత బలీయంగా వినిపిస్తున్న తరుణంలో కూడా అనవసరంగా మా దీక్షకు చిక్కులు కల్పించాలని ప్రయత్నిస్తే ప్రభుత్వమే చిక్కుల్లో పడుతుంది తప్ప మాకేం నష్టం జరగదు. నా దీక్ష మాత్రం కొనసాగి తీరుతుంది. సిద్దిపేటలో చేయాలన్నది నా ఆశయం. ఒకవేళ ఆటంకాలు కల్పిస్తే ఎక్కడ ఆటంకం కలిగితే అక్కడే దీక్షలో కూర్చుంటాను. నా ప్రాణం ఉన్నంత వరకూ నేను ఈ దీక్ష కొనసాగిస్తా.

• దీక్షకు ముందు మీడియాతో కేసీఆర్

‘గుండె మండినవాళ్లు కడుపు కాల్చుకుంటే ఎందుకంత మంట. ఎక్కడ ఆపితే అక్కడే దీక్ష మొదలుపెడతాను. కానీ, దీక్షకు దిగి తీరుతా’నని శపథం చేసి కదిలిండు కేసీఆర్. అన్నట్టే ఆపిన చోటే దీక్షకు దిగిండు. ‘సాదుకున్నా మీరే.. సంపుకున్నా మీరే’ అని అన్న కేసీఆర్ మాటలతో స్ఫూర్తి పొందిన తెలంగాణ జనం ఆయన తొవ్వలోనే నడిచారు. ‘తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో’ తేల్చుకుంటానని దీక్షకు దిగిన ఉద్యమ చంద్రుడు ఢిల్లీ మెడలు వంచి నిమ్స్ నుంచి తెలంగాణ జైత్రయాత్ర మొదలుపెట్టిండు.

# దీక్ష నడిచిందిలా..



**■ నవంబర్ 29**

మెదక్ జిల్లా సిద్దిపేట మండలం రంగధాంపల్లి చౌరస్తాను ఆమరణ నిరాహార దీక్షా వేదికను చేరుకునేందుకు కేసీఆర్ కరీంనగర్ నుంచి బయలుదేరారు. మానేరు దాటిన తర్వాత పోలీసులు కేసీఆర్ వాహనాన్ని నిలిపివేశారు. బలవంతంగా వేరే వాహనంలోకి మార్చి వరంగల్ జైలుకు తరలించారు. రాష్ట్రవ్యాప్తంగా టీఆర్ఎస్ (బీఆర్ఎస్) నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టులను పార్టీలు, ప్రజాసంఘాలు ఖండించాయి. రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు ఊపందుకున్నాయి. కేసీఆర్ అరెస్ట్‌ను నిరసిస్తూ టీఆర్ఎస్వీ నాయకుడు శ్రీకాంతాచారి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. నారాయణఖేడ్ మండలం పలుగు తండాలో ఏడుగురు చిన్నారులు ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. కేసీఆర్‌ను ఖమ్మం సబ్ జైలుకు తరలించారు. ఆహారం తీసుకోకుండా, మందులు వేసుకోకుండా జైలులోనే దీక్ష చేస్తానని ఆయన ప్రకటించారు.

**■ నవంబర్ 30**

టీఆర్ఎస్, న్యూడెమోక్రసీ పార్టీలు రాష్ట్ర వ్యాప్తంగా బంద్ నిర్వహించాయి. విద్యార్థి, ఉద్యోగ, ప్రజా సంఘాలు ఈ బంద్‌కు మద్దతిచ్చాయి. న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. 1969 ఉద్యమం తర్వాత తొలిసారిగా తెలంగాణ సంపూర్ణంగా బంద్ జరిగింది. విశ్వవిద్యాలయాల్లో ఆందోళనలు తీవ్రమయ్యాయి. కేసీఆర్ అరెస్టుకు కలతచెంది టీఆర్ఎస్వీ నేత భూక్యా ప్రవీణ్, దుద్దెడకు చెందిన శ్రీకాంత్, దండిక పృథ్వీరాజ్ ఆత్మహత్య చేసుకున్నారు. బొల్లి లక్ష్మీనారాయణ గుండెపోటుతో మరణించారు.

**■ డిసెంబర్ 1**

పోలీసులు ఖమ్మం ప్రభుత్వ హాస్పిటల్‌లో ఉన్న కేటీఆర్, హరీశ్‌రావును బలవంతంగా ఈడ్చుకుపోయారు. బలవంతంగా సెలైన్ ఎక్కించేందుకు వైద్యులు ప్రయత్నిస్తే కేసీఆర్ వాళ్లను బయటకు తోసి, తలుపులు వేసుకున్నారు.
కానిస్టేబుల్ కిష్టయ్య కామారెడ్డిలో తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

**■ డిసెంబర్ 2**

విద్యార్థులు, ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేశారు. పరామర్శించేందుకు వచ్చిన మంత్రి రాంరెడ్డి వెంకట్ రెడ్డితో మాట్లాడేందుకు కేసీఆర్ నిరాకరించారు.

**■ డిసెంబర్ 3**

తెల్లవారుజామున ఖమ్మం నుంచి కేసీఆర్‌ను నిమ్స్‌కు తరలించారు. నిమ్స్ నుంచే తెలంగాణ జైత్రయాత్ర. లేకుంటే... నా శవ యాత్రేనని కేసీఆర్ ప్రకటించారు.
కాంగ్రెస్, టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేల దిష్టిబొమ్మలను ప్రజలు తగులబెట్టారు. తెలంగాణ మంత్రులను తిరగనియ్యమని ప్రజా సంఘాలు ప్రకటించాయి.
విద్యార్థి ఉద్యమాన్ని నిలువరించేందుకు ఉన్నత విద్యాసంస్థలకు 15 రోజులు సెలవు ప్రకటించారు. శ్రీకాంతాచారి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వరంగల్ జిల్లాలో మల్లెనేని రాజ్‌కుమార్ మృతి చెందాడు.

**■ డిసెంబర్ 4**

రక్తంలో పొటాషియం, సోడియం తగ్గడంతో కేసీఆర్‌ను అత్యవసర వైద్య విభాగానికి తరలించారు. కోమాలోకి పోయే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరించారు. ప్రజలు మెచ్చే ప్రకటన చేసే వరకు తన దీక్ష, తెలంగాణ ప్రజల ఆందోళనలు కొనసాగుతాయని కేసీఆర్ ప్రకటించారు.
డిసెంబర్ 9లోగా తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించకుంటే 10న అసెంబ్లీని ముట్టడిస్తామని విద్యార్థి జేఏసీ ప్రకటించింది.
తెలంగాణ ప్రాంతంలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రుల ఇండ్లను ప్రజలు ముట్టడించారు. దిష్టిబొమ్మలను తగులబెట్టారు. తెలంగాణ కోసం 57 సంఘాలు హైదరాబాద్‌లో సమావేశమయ్యాయి.

**■ డిసెంబర్ 5**

తన చేతిలో ఏమీ లేదని సీఎం రోశయ్య ప్రకటించారు. మీరే గట్టెక్కించాలని పీసీసీ అధ్యక్షుడు వీరప్ప మొయిలీని కోరారు. సీఎం, పీసీసీ అధ్యక్షుడే పరిష్కరించుకోవాలని కాంగ్రెస్ నేతలు ప్రకటించారు. తెలంగాణ ఆకాంక్ష నెరవేర్చాలనే ప్రజల ఒత్తిడికి కాంగ్రెస్ నేతలు సోనియాకు లేఖ రాశారు.
తెలంగాణ 48 గంటల బంద్ పిలుపుతో రాష్ట్ర వ్యాప్తంగా వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. రెండు రోజులపాటు పెన్‌డౌన్ చేయాలని ఉద్యోగ సంఘాలు పిలుపునిచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర బలగాలను పంపాలని కోరింది. హైదరాబాద్‌లో 144 సెక్షన్ అమలు చేశారు.

**■ డిసెంబర్ 6**

48 గంటల బంద్ తొలి 24 గంటలు విజయవంతమైంది.
అవయవాలు క్షీణిస్తున్నాయని, ఇన్‌ఫెక్షన్ సోకే ప్రమాదం ఉందని నిమ్స్ డైరెక్టర్ ప్రకటించారు. దీక్ష విరమిస్తే ప్రాణాలు దక్కుతాయని వైద్యులు సూచించినా కేసీఆర్ తగ్గలేదు.
మంత్రులు, ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పరామర్శించారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు పెడితేనే విరమిస్తానని కేసీఆర్ సీఎంకు తేల్చి చెప్పారు.
రాష్ట్ర రాజధాని ఫ్రీజోన్ కాదని అసెంబ్లీలో తీర్మానం పెడతామని, కేసీఆర్‌పై కేసులు ఎత్తివేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.
అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి.

**■ డిసెంబర్ 7**

48 గంటల తెలంగాణ బంద్ విజయవంతమైంది. మరో ఐదుగురు తెలంగాణ కోసం బలవన్మరణానికి పాల్పడ్డారు.
అసెంబ్లీ సమావేశాల్లో తెలంగాణపై చర్చకు సిద్ధమని, తీర్మానం పెట్టలేమని ముఖ్యమంత్రి బీఏసీ సమావేశంలో చెప్పారు.
పోలీసులు జర్నలిస్టులపై దాడి చేసి, కెమెరాలను ధ్వంసం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులకు అండగా ఉన్న వడ్డెర బస్తీపై పోలీసులు దాడి చేశారు. న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు.

**■ డిసెంబర్ 8**

కేసీఆర్ ఆరోగ్యం ప్రమాదకరంగా ఉందని, ప్రొటీన్లు, అల్బుమిన్లు లోపించాయని, ఇక తమ చేతుల్లో ఏమీ లేదని వైద్యులు చేతులెత్తేశారు. తెలంగాణ ఉద్యమం కోసం మరో ముగ్గురు ఆత్మబలిదానం చేసుకున్నారు.
కేంద్ర ప్రభుత్వ పెద్దలతో చర్చించేందుకు సీఎం ఢిల్లీ చేరుకున్నారు. కేంద్రం 23 వేల మందితో కూడిన సాయుధ బలగాలను తెలంగాణ జిల్లాల్లో దింపింది.
రాజధానికి ఎవరూ రావద్దని పోలీసులు హెచ్చరించారు.
ప్రత్యేక ఆంధ్ర కావాలని ఆంధ్రా ప్రాంతంలో జై ఆంధ్ర ఉద్యమం ఆరంభించారు.

**■ డిసెంబర్ 9**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తామని, విద్యార్థులు, ఉద్యమకారులపై కేసులు ఎత్తివేస్తామని కేంద్ర హోంమంత్రి చిదంబరం పార్లమెంట్‌లో ప్రకటించారు. ఇది తెలంగాణ ప్రజల విజయమని కేసీఆర్ ప్రకటించారు.
జయశంకర్ నిమ్మరసం తాగించి కేసీఆర్ దీక్ష విరమింపజేశారు.
తెలంగాణ ప్రజల సంబురాలు అంబరాన్నంటాయి. ఉస్మానియా విద్యార్థులు అసెంబ్లీకి జైత్రయాత్ర నిర్వహించారు.



# కేసీఆర్‌ను ఎన్‌కౌంటర్ చేస్తరని భయపడ్డం

> నా పుట్టిన రోజును మరచిపోతనేమో కానీ దీక్షా దివస్‌ను మరచిపోను

## సిమెంట్ బస్తను ఇసిరేసినట్టు పోలీసులు కేసీఆర్‌ను ఇసిరేసిండ్లు

### మాజీ ఎంపీ, మాజీ మంత్రి కెప్టెన్ లక్ష్మీకాంతా రావు

**ఒకనాడు సైన్యంలో దేశంకోసం పాకిస్తాన్ యుద్ధంలో పాల్గొంటే దేశభక్తుడిగా భారత ప్రభుత్వం సేవామెడల్ ఇచ్చింది. కానీ, తెలంగాణ ప్రాంతం కోసం ప్రత్యేక రాష్ట్ర సాధన పోరాటం చేస్తుంటే సమైక్య పాలకులు కర్కశంగా వ్యవహరించారు. యుద్ధ సమయంలో బంకర్లలో బతికినా దిగులు చెందలేదు. కానీ 2009, నవంబర్ 29 నాటి సందర్భం గుర్తుకువస్తే ఇప్పటికీ ఒళ్లు గగుర్పాటుకు గురవుతుంది అని మాజీ మంత్రి, మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతా రావు అన్నారు. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో.., కేసీఆర్ శవయాత్రో.. తెలంగాణ జైత్రయాత్రో అని కేసీఆర్ ఆమరణ నిరాహారదీక్షకు దిగిన ఆ చారిత్రక ఘట్టానికి కెప్టెన్ ప్రత్యక్ష సాక్షి. ఆ రోజు ఏం జరిగింది? కరీంనగర్ నుంచి ఖమ్మం జైలు దాకా జరిగిన పరిణామాల గురించి ‘నమస్తే తెలంగాణ’ పలుకరించగా కెప్టెన్ లక్ష్మీకాంతా రావు కండ్లకు కట్టారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే...**

**తెలంగాణ** రాష్ట్ర సాధన కోసం ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ చేసిన త్యాగం మరువలేనిది, ఆయన చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష రాష్ట్రాన్ని సాధించిపెట్టింది. జీవితంలో తన పుట్టిన రోజును మరచిపోతానేమో కానీ, నవంబర్ 29 తారీఖు ఎన్నటికీ మరచిపోలేను.

**మరచిపోలేని రోజు...**

2009, నవంబర్ 29 నుంచి డిసెంబర్ 9 దాంక జరిగిన సంగతులు జీవితంలో మరచిపోలేనివి. నా పుట్టిన రోజును మరచిపోతనేమో కానీ ఆ రోజును మరచిపోలేం. తెలంగాణ కోసం కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు తయారైపోతున్న రోజు (2009, నవంబర్ 29) పోలీసులు కరీంనగర్ నుంచి అల్లనూర్ దాంక భయంకరమైన వాతావరణాన్ని సృష్టించారు. కరీంనగర్ తెలంగాణ భవన్ నుంచి మేం దాదాపు వందకుపైగా వాహనాల కాన్వాయితో బయలుదేరినం. కేసీఆర్, జయశంకర్, నేనూ, నాయిని నర్సింహారెడ్డి, రాజయ్య యాదవ్, జీవీఆర్ ఇట్లా అందరం ఒకే వెహికిల్‌లో బయలుదేరాం.



**మా** కాన్వాయిని అల్లనూర్ బ్రిడ్జి దగ్గర పోలీసులు తప్పించారు. ఒక్క మా వెహికలే.. మాకు ఇటుపక్క అటుపక్క మొత్తం పోలీసోల్ల వెహికిల్సే. మెల్లమెల్లగా కాన్వాయిని తప్పించిండ్లు.

**అల్లనూర్** దగ్గరికి వచ్చేసరికి యుద్ధ వాతావరణం. అక్కడ నానా రకాల డ్రెస్సులతో, నానా రకాల తుపాకులతో, నానా రకాల లాఠీలతో మొత్తం అదొక యుద్ధక్షేత్రమనిపించింది.. మొత్తం పోలీసోల్లే. ఒక పెద్ద పోలీసాఫీసర్ కేసీఆర్ దగ్గరికి వచ్చి ‘సర్ మిమ్ములను అరెస్టు చేస్తున్నం’ అని అనంగనే కేసీఆర్ బాగా కోపం చేసిండు. ‘నన్ను అరెస్టు చేసేందుకు నీ దగ్గర ఏమన్నా కాయితం ఉందా.. నేను అరెస్టు కాను బండి దిగను’ అని చెప్పిండు. బలవంతంగా ఆయన్ను దించడంతోనే కేసీఆర్ నేలమీద కూసున్నడు. నిరసన తెలుపుతనే ఉన్నడు.

**వస్తువును విసిరేసినట్టు...**

‘అరే సార్ దిగిండు మనం కుడ దిగుతం’ అని దిగినం క్షణాల్లో పోలీసులు మమ్మలందరినీ పట్టుకున్నరు. పెద్ద బస్సు, పదుల సంఖ్యలో పోలీసుల వాహనాలు అక్కడి నుంచి స్టార్ట్ అయినయ్. అక్కడి నుంచి ఏం చెప్పుకుంట, ఎక్కడా ఆపకుంట ఖమ్మం తీస్కపోయిండ్లు. ఖమ్మంలో ఒక ఎక్సైజ్ కేసులు చూసే ఒక రిటైర్డ్ జడ్జి ముందర పెట్టిండ్లు. అరే ఇదేంది అని ఆశ్చర్యపోయిండ్లు అందరూ. అప్పటికీ కేసు లేదు ఏం లేదు. అప్పటికప్పుడు మూడు గంటలు అక్కడ వెయిట్ చేయించి కేసు బుక్ చేసిండ్లు. కేసీఆర్ అన్నరు ‘మమ్ములను ఖమ్మం జైల్లో పెట్టొద్దు. అదొక చిన్న జైలు. మమ్మల్ని ఉంచాలంటే సెంట్రల్ జైలుకు తరలించాలే’ అన్నడు. అయితే అక్కడ పరిస్థితిని అనుమానంగా చూసిన జడ్జికి పోలీసులు రాసిచ్చిండ్లు ‘మేం రేప్పొద్దున హైదరబాద్‌కు షిఫ్ట్ చేస్తం’ అన్నరు. అంటే ఆయన రిమాండ్ రాసిండు. అప్పటికే కేసీఆర్ దీక్ష కొనసాగిస్తున్నడు. తెల్లారి ఓ పోలీసాఫీసర్ వచ్చిండు. ఎందుకచ్చిండ్లు? అని అడిగితే ‘ఊర్కనే చూసి పోతమని వచ్చినం’ అన్నడు. అంతా చూసుకొని పోయిండ్లు. తర్వాత చానా మంది పోలీసులతో వచ్చిండు. వస్తూ వస్తూ ఓ దిక్కుమాలిన, చిలుము పట్టిన స్ట్రెచర్ తీస్కచ్చిండు. అప్పటికే డాక్టర్ సాబ్ (జీవీఆర్) కేసీఆర్‌కు పల్స్ చూస్తాండు. మేమంతా ఏంటీ పరిస్థితి అనుకుంటున్నం.. అప్పుడే పోలీసులు మా బ్యారక్‌లోకి వచ్చిండ్లు.. వాళ్ల రాకను గమనించి నాయిని నర్సింహారెడ్డి మిగతావాళ్లమంత గొడవజేసినం. ఒక సిమెంట్ బస్తను బండ్లెకు ఇద్దరు మనుషులు పట్టుకొని ఇసిరేసినట్టు, ఒక ప్రాణం లేని వస్తువును విసిరేసినట్టు కేసీఆర్‌ను ఇద్దరు పట్టుకొని ఆ స్ట్రెచర్ మీద విసిరేసిండ్లు. మేం గొడవ పడుతున్నం. నాయినిని నెట్టేస్తే ఆయన కాలికి దెబ్బ తాకింది. డాక్టర్ సాబ్‌ను గోడకు నెట్టేస్తే ఆయనకూ దెబ్బ తాకింది. రాజయ్య యాదవ్‌ను ఓ దిక్కు నెట్టేసిండ్లు. నాక్కోపమచ్చింది. నేను బ్యారక్ గేట్ దగ్గర కొద్దిసేపు ప్రతిఘటించిన. అయినా అందరినీ నెట్టేసి దుర్మార్గంగా బ్యారక్‌కు తాళం వేసి కేసీఆర్‌ను తీస్కపోయిండ్లు.

**కాల్రెక్కలు ఇరగ్గొట్టి..?**

మాకు ఒకటే ఆందోళన.. ఉద్యమ నాయకుడినే ఇట్ల చేస్తే మనగతేంది? అని అనుకున్నం. అసలు కేసీఆర్‌ను వీళ్లేంజేస్తరు. కొంపదీసి ఎన్‌కౌంటర్ చేస్తరా.. ఏంది? జైలు బయట ఏం జరుగుతుందో మాకు అర్థం కావడంలేదు? కేసీఆర్‌ను ఏం చేస్తరు? పోలీసులు గింత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నరు ఏందిది? అని మా మనసులు బాధించినయి. నిజానికి చెప్పడానికి నోరురావడం లేదు.. కానీ, అప్పుడు దుఃఖం తప్ప ఏం చేయలేకపోయినం.. అట్లాంటి పరిస్థితి అది. అక్కడి నుంచి కేసీఆర్‌ను హాస్పిటల్‌కు తీస్కపోయిండ్లని, అక్కడ ఆయన మమ్ములను కూడా పిలవాలని గట్టిగ చెప్పడంతో జైలర్ వచ్చి ‘కేసీఆర్ హాస్పిటల్‌లో ఉన్నడు మిమ్ములను కూడా అక్కడికే రమ్మంటున్నరు’ అని చెప్పేసరికి భయం వేసింది. ఈ దుర్మార్గపు పోలీసులు ‘కాల్రెక్కలు ఇరగ్గొట్టి హాస్పిటల్‌లో వేశారా?’ పోలీసుల తీరు చూస్తే అదే అనుమానం. అయితే మేం జైలు నుంచి బయటకు రావడానికి అక్కడ దాదాపు అర్ధ గంట తతంగం నడిచింది. కానీ, కేసీఆర్‌కు ఇవేమీ చేసినట్టు జైలు రికార్డుల్లో లేవు. మేం జైలర్‌ను అడిగాం. వాళ్లు నీళ్లు నమిలారు. జైలు వాళ్లు ఆగమాగం అయితాండ్లు. దాన్ని చూసి మా అనుమానానికి మరింత బలం వస్తాంది. మల్లా మేం జైలు నుంచి హాస్పిటల్‌కు పోయేసరికి అక్కడ బయటంతా యుద్ధ వాతావరణమే. పోలీసులు తెలంగాణవాదులు, హరీశ్‌రావు, కేటీఆర్.. వాళ్లతోపాటు జయశంకర్ సర్ అందరూ ఉన్నరు. ఎవ్వరి ముఖాలు చూసినా ఆందోళనే కన్పిస్తున్నది. మాకు మరింత భయం పెరిగింది. మమ్మల్ని అరెస్టు చేశామన్న విషయం తెలుసుకొని అల్లనూర్ నుంచి ఖమ్మం దాకా ఊరూరా జనం క్షణాల్లో రోడ్లమీదికి వచ్చి ఆందోళన చేస్తున్న దృశ్యాలను మేం కండ్లారా చూసినం. ఎక్కడికక్కడ పోలీసులు ప్రతీ గ్రామంల తెలంగాణవాదుల్ని అదుపులోకి తీసుకోవడం.. లాఠీ చార్జీలు చేయడం లాంటివి చూస్తూ హాస్పిటల్‌కు చేరుకున్నం.

ఇక్కడేమో సీన్ అంతా ఇట్లా నిశబ్దంగా ఉంది. ‘జరగరానిది ఏదన్నా జరిగిందా’ అన్న అనుమానం వచ్చింది. అప్పటికే కేసీఆర్ దీక్ష విరమించిండని, ప్రచారం చేసిండ్లు. ఎట్టి పరిస్థితుల్లో దీక్ష విరమించే ఆలోచనే ఆయనకు లేదని మాకు తెలుసు. కానీ పోలీసులే ఏదో చేసి ఉంటరని అనుకున్నం. కేసీఆర్ చేత బలవంతంగా దీక్ష విరమింపజేసినట్టు ఏవో తాగిచ్చిండ్లనీ, అదికూడా ఆయన ప్రమేయం లేకుండానే జరిగిపోయిందని అక్కడున్నోళ్లు చెప్పిండ్లు. ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీల్లో పిల్లలు కేసీఆర్ దీక్ష విరమించాలని, లేదంటే మేం పెట్రోల్ పోసుకొని చనిపోతామని నాలుగైదు వందల మంది ఆందోళన చేస్తున్నారని.. ఇలా నానా రకాల అబద్ధాలను కేసీఆర్‌కు ఒకవైపు చెప్తూనే మరోవైపు ఆయనకు ఏదో మత్తు ఇచ్చి ఆయన చేత గ్లాస్ పట్టిచ్చి పోలీసులే ఫొటో తీయించి ప్రెస్‌కిచ్చి నానా రకాలుగా ఉద్యమాన్ని మలినం చేసిండ్లు. ఆయనకు అసలు విషయం తెలిసి చాలా సీరియస్ అయ్యారు. అప్పటికే ఆయన దీక్ష కొనసాగిస్తున్నరని, పోలీసులు దుర్మార్గంగా దీక్ష విరమింపజేసినట్టు జయశంకర్ సార్ చెప్పిండు.

**‘లేదు..** లేదు నేనే అసలు విషయం చెప్తా’.. అని కేసీఆర్ అల్లకల్లోలం చేశారు. అంతకుముందే స్టేట్ హ్యూమన్ రైట్స్‌ను ఆశ్రయిస్తే కలెక్టరే స్వయంగా హాస్పిటల్‌కు రావడంతో పరిస్థితి మారింది. ఒకనాడు సైన్యంలో దేశం కోసం పాకిస్తాన్ యుద్ధంలో పాల్గొంటే దేశభక్తుడిగా భారత ప్రభుత్వం సేవామెడల్ ఇచ్చింది. కానీ, మేం తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటం చేస్తుంటే జైల్లో వేసింది ప్రభుత్వం. కేసీఆర్ అకుంఠిత పట్టుదల సామాన్యమైందిగాదు. ఆఖరికి తెలంగాణ ప్రజల పోరాట పటిమ చూసి కేంద్రం దిగివచ్చింది. తెలంగాణను సాధించిన గొప్ప నాయకుడిగా కేసీఆర్ పోరాటం చరితార్థమైంది. సాధించిన ప్రత్యేక రాష్ట్రంలో సీఎం కేసీఆర్ తన దార్శనిక పాలనతో బంగారు తెలంగాణగా తీర్చిదిద్దుతున్నారు. జీవితానికి మరచిపోలేని అనుభవాన్ని, తృప్తిని ఇచ్చింది.

... ప్రజ్ఞావర్షిత్